సాక్షి ఖమ్మం

సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



'కోడ్' కలవరం..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50వేలకు మించి తీసుకెళ్లే వీలు లేక, శుభకార్యాలు చేసుకునే వారు ఇబ్బంది పడుతున్నారు. 8లో



ఫలరాజుకు కష్టకాలం

ఫలరాజుగా పేరున్న మామిడి దిగుబడిపై ఈ ఏడాది అనావృష్టి, తెగుళ్ల బెడద ప్రభావం చూపుతోందని రైతులు అంటున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం అక్కడక్కడా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మిగితా చోట్ల ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ పురుషుల జట్టుకు ఎంపికలు నిర్వహించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27 నుంచి గోదావరిఖనిలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొననున్నారు. కాగా, జిల్లా జట్టుకు కె.వీనిత్ బాబు, కె.రాజ్‌కుమార్, బి.గోపీచంద్, బి.ఇలీషా, బి.గోపినాథ్, పి.శివ, వి.చక్రి, బి.పవన్‌కుమార్, ఇ.శరత్, బి.చంద్రశేఖర్, ఎస్.కె.ఇషాక్, ఎం.సంతోష్, ఎస్కే అక్బర్, ఎస్.విలన్స్‌బాబు, ఆర్.అమర్, ఎస్కే ముబీన్, ఐ.నోయెల్, డి.అక్షిత్, పి.అజిత్‌కుమార్ ఎంపికయ్యారు. జట్టుకు కోచ్‌కం మేనేజర్‌గా కె.రవికుమార్ వ్యవహరిస్తారు. ఈ ఎంపికల ప్రక్రియలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఈ సెల్యూకాస్, కె.ఆదర్శ్‌కుమార్, సాయిరాం, రమణ పర్యవేక్షించారు.

జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ జట్లను ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 48 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయగా.. వారు ఈనెల 28న సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపిక ప్రక్రియను జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్ అహ్మద్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ బి.వెంకన్న, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్, ఎం.సుధాకర్, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లా జట్లు ఇవే..

అండర్–14 బాలుర విభాగంలో ఎం.లోకేష్, ఎల్.మహదీప్, బాలికల విభాగంలో సి.రిష్యశ్రీ, అండర్–16 బాలురలో జి.తేజ్‌వాల్, కె.అజయ్ కుమార్, కె.మస్తాన్, బాలికల్లో ఎ.మనుశ్రీ, బి.కావ్య, డి.సాగరిక, పి.క్రాంతిక, అండర్ – 18 బాలురలో జి.వీనిల్, ఎస్.శ్రీరామచంద్ర, పి.గోపీచంద్, బాలికలలో బి.సింధుప్రియ, డి.బిందు, అండర్ –20 మహిళల్లో కె.అఖిల, ఎ.మైథిలి, పురుషుల్లో బి.విష్ణు ఎంపికయ్యారు.

హస్తినలో సత్తా..



జలగం వెంగళరావు(ఫైల్)

పీవీ రంగయ్య నాయుడు

నాదెండ్ల భాస్కర్ రావు

రేణుకాచౌదరి

జిల్లా రాజకీయ చరిత్రలో ఎందరో నేతలు జిల్లా, రాష్ట్ర రాజకీయాలను శాసించారు. నాయకులుగా, ఉద్యమకారులుగా, పార్టీ నేతలుగా జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. అయితే జిల్లాకు చెందిన కొందరే రాజ్యాంగపర అత్యున్నత పదవులు అధిరోహించారు. ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ఏలిన ఆ నేతలు.. తదనంతరం ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి గెలుపొంది ఢిల్లీ పార్లమెంట్ మెట్లు ఎక్కారు. ఇలా రాష్ట్ర, దేశ రాజధానుల్లో తమ సత్తా చాటారు ఆ నేతలు. అలాగే జలగం వెంగళరావుతోపాటు పీవీ రంగయ్యనాయుడు, రేణుకాచౌదరి కేంద్రమంత్రులుగా కూడా పనిచేయడం విశేషం. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

కేంద్ర మంత్రులుగా జిల్లా నేతల సేవలు

- సీఎంగా చెరగని ముద్ర వేసిన జలగం వెంగళరావు
- ఖమ్మం నుంచి పార్లమెంట్‌కు ఎన్నికైన మరో సీఎం నాదెండ్ల
- ఢిల్లీ స్థాయిలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు

ముఖ్యమంత్రి టు కేంద్రమంత్రి..

జలగం వెంగళరావు ఉమ్మడి ఖమ్మం జిల్లాపై చెరగని ముద్ర వేశారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఆయన బీజం వేశారు. ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేసుకున్నారు. 1973 డిసెంబర్ 10 నుంచి 1978 మార్చి 6 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఆయన హయాంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి బాట పట్టింది. 1984లో ఇందిరాగాంధీ మరణం తర్వాత జరిగిన ఎన్నికల్లో ఖమ్మం నుంచి జలగం వెంగళరావు ఎంపీగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన ఆయన రాజీవ్ గాంధీ కేబినెట్‌లో పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. 1989లో రెండోసారి ఎంపీగా ఖమ్మం నుంచి విజయం సాధించారు.

ముచ్చటగా ముగ్గురు మంత్రులు..

ఇక 1957 నుంచి ఇప్పటి వరకు ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి గెలిచిన ముగ్గురు ఎంపీలు మంత్రులుగా వ్యవహరించారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు 1984లో కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. 1991లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఐపీఎస్ అధికారి పీవీ రంగయ్య నాయుడిని కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా బరిలో దింపగా, విజయం సాధించిన ఆయన పీవీ నరసింహారావు ప్రభుత్వంలో టెలీకమ్యూనికేషన్లు, జలవనరుల శాఖ మంత్రిగా చేశారు. 1996లో రెండోసారి పోటీ చేసినా.. ప్రస్తుత సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చేతిలో ఓటమి పాలయ్యారు. ఇక 1999, 2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రేణుకా చౌదరి విజయం సాధించారు. ఆమె మన్మోహన్‌సింగ్ కేబినెట్‌లో రెండుసార్లు స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఏడాది పాటు ఎంపీగా నాదెండ్ల..

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేత నాదెండ్ల భాస్కరరావు. ఆయన రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ఎంపీగా పనిచేశారు. తెలుగుదేశం పార్టీ హయాంలో మంత్రిగా పనిచేయడంతోపాటు 1984 ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు నెలరోజుల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావును గద్దె దించడంలో నాదెండ్ల భాస్కరరావు ప్రధాన భూమిక పోషించారు. తదనంతర పరిణామాల్లో నాదెండ్ల కాంగ్రెస్‌లో చేరారు. 1998 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి, సీపీఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రంపై 11,664 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తిరిగి 1999లోనే ఎన్నికలు రావడంతో ఏడాది పాటు మాత్రమే ఆయన ఎంపీగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంలుగా పనిచేసిన ఇద్దరు నేతలు ఖమ్మం పార్లమెంట్ నుంచి పోటీ చేసి విజయం సాధించడంతో ఈ స్థానం రాజకీయంగా నాటి నుంచి నేటి వరకు ప్రముఖంగా నిలిచింది.

స్థానిక నేత ఒకరు.. వలస నేత ఒకరు..

జలగం వెంగళరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంగానే రాజకీయాలు నడిపారు. సత్తుపల్లిలో జలగం కుటుంబం ఎక్కువ కాలం ఆధిపత్యం వహించింది. 1957లో జలగం కొండలరావు, 1962, 1967, 1972లో వేంసూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జలగం వెంగళరావు గెలుపొందారు. 1978లో ఏర్పడిన సత్తుపల్లి నియోజకవర్గంలో కూడా జలగం వెంగళరావు విజయం సాధించారు. ఆయన కాసు బ్రహ్మానందరెడ్డి, పీవీ నర్సింహారావు కేబినేట్‌లో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి పీఠాన్ని సైతం అధిరోహించారు. ఇలా తన రాజకీయ జీవితం మొత్తం ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే కొనసాగించారు. నాదెండ్ల భాస్కర్‌రావు 1984 ఆగస్టు సంక్షోభంలో ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం 1998లో ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయండి

పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి గౌతమ్



సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్ : ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సహాయ రిటర్నింగ్ అధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తి చేయాలన్నారు. మొదటి దశ ర్యాండమైజేషన్ తర్వాత ఈవీఎంలను ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు తరలించామని చెప్పారు. వచ్చేనెల 3, 4 తేదీల్లో రెండో విడత ర్యాండమైజేషన్, కమిషనింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఈవీఎంల రవాణాలో హమాలీలకు నియోజకవర్గం తెలిసేలా టీ షర్టులపై స్టిక్కర్లు వేయించాలన్నారు. ఇంటింటికీ ఓటరు స్లిప్పుల పంపిణీని ఈ నెల 25 నుంచి చేపట్టాలన్నారు. ఓటర్ హెల్ప్‌లైన్, సీ విజిల్ యాప్, ఓటు వేయడంపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. మే 3 నుంచి హోం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని, ఓటింగ్ టీమ్‌లకు శిక్షణ ఇవ్వాలని అన్నారు. పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ మే 3న ప్రారంభం అవుతున్నందున, అంతకుముందే పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. మేజర్ సభలు, కార్యక్రమాల్లో సహాయ వ్యయ పరిశీలకులు హాజరయ్యేలా చూడాలన్నారు.

ఈవీఎంల తరలింపు

జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు ఈవీఎంలను తరలిస్తున్నట్లు గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని గోడౌన్ నుంచి నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు ఆదివారం తరలించారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకు సంబంధించి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో, వైరా నియోజకవర్గానికి వైరాలోని బాలికల సాంఘిక సంక్షేమ పాఠశాల, మధిరకు సంబంధించి మధిరలోని పాలిటెక్నిక్ కళాశాల, సత్తుపల్లి నియోజకవర్గానికి సత్తుపల్లిలోని జ్యోతి నిలయం హైస్కూల్‌లో స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేశామని వివరించారు. ఖమ్మం నియోజకవర్గానికి 440 బ్యాలెట్ యూనిట్లు, 440 కంట్రోల్ యూనిట్లు, 497 వీవీ ప్యాట్లు, పాలేరుకు 359 బ్యాలెట్ యూనిట్లు, 359 కంట్రోల్ యూనిట్లు, 406 వీవీప్యాట్లు, వైరాకు 312 బ్యాలెట్ యూనిట్లు, 312 కంట్రోల్ యూనిట్లు, 352 వీవీప్యాట్లు, మధిరకు 332 బ్యాలెట్ యూనిట్లు, 332 కంట్రోల్ యూనిట్లు, 375 వీవీ ప్యాట్లు, సత్తుపల్లి నియోజకవర్గానికి 364 బ్యాలెట్ యూనిట్లు, 364 కంట్రోల్ యూనిట్లు, 411 వీవీప్యాట్లు తరలిస్తున్నట్లు వివరించారు. ఆయా సమావేశాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కెఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఆర్డీఓలు గణేష్, రాజేందర్, డీఆర్డీఓ సన్యాసయ్య, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాడు సంక్షేమం.. నేడు సంక్షోభం



ఖమ్మంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ, పక్కన నామ నాగేశ్వరరావు, వద్దిరాజు, తాతా మధు తదితరులు

- ప్రజలను పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్ నాయకుల కుట్ర
- మాయమాటలకు మరోసారి మోసపోవద్దు
- రాష్ట్రంలో బీఆర్ఎస్ 10 నుంచి 12 ఎంపీ స్థానాల్లో గెలుస్తుంది
- మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీలు నామ, వద్దిరాజు

ఖమ్మంమయూరిసెంటర్/కారేపల్లి : బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచారని, కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో సంక్షేమ రాష్ట్రాన్ని సంక్షోభ రాష్ట్రంగా మార్చిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ నామ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం వారు బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో, కారేపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తొలుత మాజీ మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్త శ్రీనివాస్‌నాయక్‌ను కాంగ్రెస్ వారు హత్య చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో హత్యారాజకీయాలు లేవని, అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ పాలన సాగించారని చెప్పారు. ఖమ్మం పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్‌కు అనుకూలంగా సర్వేలు వస్తున్నాయని తెలిపారు. ఈనెల 24న తాను నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు నామ నాగేశ్వరరావు తెలిపారు. 29న ఖమ్మంలో, 30న కొత్తగూడెం జిల్లాలో తన విజయాన్ని కాంక్షిస్తూ కేసీఆర్ రోడ్‌షో నిర్వహిస్తారని తెలిపారు. ప్రజా సమస్యలు, రాష్ట్ర, జిల్లా సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పింది ఒక బీఆర్ఎస్ మాత్రమేనని, కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పట్టనట్లు వ్యవహరించారని ఆరోపించారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి జిల్లాలో రోడ్లు వేయించిన ఘనత తమదేనని వద్దిరాజు రవిచంద్ర అన్నారు. అభివృద్ధిని కొనసాగించేందుకు మరోసారి నామ నాగేశ్వరరావును గెలిపించుకోవాలని అన్నారు. తెలంగాణలో 10 నుంచి 12 స్థానాల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని, అందులో నామ కూడా ఉన్నారని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగాయని అన్నారు. గతంలో ఉన్న భూస్వామ్య వ్యవస్థను తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తోందని ఆరోపించారు. ఆయా సమావేశాల్లో బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ మదన్‌లాల్, ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కారేపల్లి మాజీ జెడ్పీటీసీ ఉన్నం వీరేందర్, నాయకులు దొంకపర్తి సుబ్బారావు, హన్మకొండ రమేష్, నర్సింగ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ మూడ్ జ్యోతి, ధర్మసోత్ శంకర్, జడల వెంకటేశ్వర్లు, గౌసుద్దీన్, డొంకెన రవీందర్, బత్తుల శ్రీనివాసరావు, తాళ్లూరి హరీష్, సరిపూడి గోపి, పాల్వంచ రాజేష్, చీకటి రాంబాబు పాల్గొన్నారు.

కల్యాణ రాముడికి ఊంజల్ సేవ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం కమనీయంగా ఊంజల్ సేవ జరిపారు. నూతన వధూవరులైన సీతా రాములను ఊయలలో కొలువుదీర్చి లాలలు...జోలలు పాడుతుండగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం పొందారు. ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో పూజలు చేసి శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను కొలువుదీర్చి హారతి సమర్పించారు. ఆస్థాన హరిదాసులు భక్త రామదాసు, తూము నర్సింహదాసు కీర్తనలను ఆలపించారు. అనంతరం స్వామివారికి స్వర్ణ సింహవాహన సేవ జరిపారు.

24 నుంచి నిత్యకల్యాణాలు తిరిగి ప్రారంభం

బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారికి వసంతోత్సవం జరపనున్నారు. మంగళవారం జరిపే చక్రతీర్థం, ధ్వజావరోహణం, పుష్పయాగంతో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. దీంతో స్వామివారి నిత్యకల్యాణాలు 24 నుంచి పునఃప్రారంభం కానున్నాయి.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024 – 25 విద్యా సంవత్సరంలో 6 నుంచి 9వ తరతగతిలో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఖమ్మం ఆర్సీఓ కె.ప్రత్యూష తెలిపారు. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం జిల్లాలో 3 సెంటర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3 కేంద్రాలు, మహబూబాబాద్ జిల్లాలో 4 కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. 6వ తరగతి ప్రవేశానికి 1,118 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,003 మంది పరీక్షకు హాజరయ్యారని, 115 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. 7వ తరగతిలో ప్రవేశానికి 739 మంది దరఖాస్తు చేసుకోగా 675 మంది హాజరయ్యారని, 64 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. 8వ తరగతిలో ప్రవేశానికి 1,100 మంది దరఖాస్తు చేసుకోగా 958 మంది హాజరయ్యారని, 142 మంది గైర్హాజరయ్యారని, 9వ తరగతిలో ప్రవేశానికి 1,161 మంది దరఖాస్తు చేసుకోగా 1,066 మంది హాజరయ్యారని, 95 మంది గైర్హాజరయ్యారని ప్రత్యూష వివరించారు.

అకాల వర్షం.. ఆగమాగం

- వరి, మొక్కజొన్న పంటలపై ప్రభావం
- అక్కడక్కడా నేలరాలిన మామిడి
- వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ



మరిన్ని వివరాలు 9లో

తిరుమలాయపాలెం మండలం ఎదుళ్లచెరువులో ధాన్యం రాశులవద్ద నీటిని తొలగిస్తున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం : అకాల వర్షం యాసంగి పంటలను ఆగం చేసింది. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కూసుమంచి, మధిర వ్యవసాయ డివిజన్లలో ఈదురుగాలుల ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. జిల్లాలో యాసంగి పంటలు ప్రస్తుతం చేతికందుతున్న దశలో అకాల వర్షంతో వరి, మొక్కజొన్నతో పాటు మామిడి పంటలపై ప్రభావం పడనుంది. జిల్లాలో ప్రస్తుత యాసంగిలో 1,83,612 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేయగా, వరి 1,05,335 ఎకరాలు, మొక్కజొన్న 64,683 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మామిడి 31 వేల ఎకరాల్లో సాగులో ఉంది. వరి, మొక్కజొన్న పంటలు కొన్నిచోట్ల కోస్తుండగా, అనేక ప్రాంతాల్లో ఇప్పటికే కోసి కళ్లాల్లో ఆరబెట్టారు. కొనుగోలు కేంద్రాల్లోనూ విక్రయాలు సాగుతున్నాయి. మామిడికాయ పక్వానికి వచ్చే దశలో ఉంది. మరో 20 రోజుల్లో మామిడి కోతలు ముమ్మరంగా సాగే అవకాశం ఉంది. మిర్చి కూడా పలు ప్రాంతాల్లో ఆరబెట్టి ఉంది.

వరి, మొక్కజొన్నపై ప్రభావం

ఈదురుగాలులు, అకాల వర్ష ప్రభావం వరి, మొక్కజొన్న పంటలపై ఉంది. వరి అధికంగా కూసుమంచి డివిజన్‌లో 49,226 ఎకరాల్లో, సత్తుపల్లి డివిజన్‌లో 30,029 ఎకరాల్లో సాగు చేశారు. మధిర డివిజన్‌లో 11,500 ఎకరాల్లో సాగైంది. సత్తుపల్లి డివిజన్‌లో పంట కోతలు చివరి దశకు చేరగా, కూసుమంచి డివిజన్‌లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్కడక్కడా రైతులు రాశులు పోయగా, పలు ప్రాంతాల్లో కళ్లాల్లో ఆరబెట్టి ఉంచారు. అకాల వర్షంతో ఆరబెట్టిన ధాన్యాన్ని కుప్పగా చేసి పట్టాలు కప్పుతున్నారు. కోత దశలో ఉన్న వరి పంట నేలరాలుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మధిర డివిజన్‌లో మొక్కజొన్న అధికంగా 36,309 ఎకరాల్లో, వైరా డివిజన్‌లో 10,739, కూసుమంచి డివిజన్‌లో 8,022 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న కోతలు ప్రారంభమవుతున్నాయి. ఈ దశలో వచ్చిన ఈదురుగాలులతో అక్కడక్కడా పైరు నేలవాలింది.

నేలరాలిన మామిడి..

జిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా, కూసుమంచి డివిజన్లలో మామిడి సాగు ఉంది. ఆలస్యంగా వచ్చిన పూతతో మామిడి ప్రస్తుతం కాయ దశలో ఉండగా మరో 20 రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది వివిధ కారణాలతో తక్కువ కాతతో ఉన్న మామిడికి ఈదురుగాలులు, అకాల వర్షం మరింత నష్టాన్ని మిగిల్చే ప్రమాదం ఉంది. కూసుమంచి, మధిర, ఖమ్మం, వైరా డివిజన్లలో అక్కడక్కడా మామిడి కాయ నేలరాలినట్లు రైతులు చెబుతున్నారు.

వివరాల సేకరణలో అధికారులు..

ఈదురుగాలులు, అకాల వర్షం ప్రభావంతో పంటల పరిస్థితిపై నివేదిక అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ డివిజన్, మండల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో గ్రామ స్థాయిలో వ్యవసాయ విస్తర్ణాధికారులు నేలవాలిన, దెబ్బతిన్న పంటల వివరాలను ప్రాథమికంగా సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు మండల వ్యవసాయాధికారులకు అందించే పనిలో ఉన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎం. విజయనిర్మల ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి నుంచి సమాచారం తెప్పించుకొని ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. సోమవారానికి పూర్తి స్థాయిలో నివేదిక తయారు చేసి వివరాలు అందించే అవకాశం ఉంది. కాగా, ఆదివారం సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పు వచ్చింది. వర్షంతో ఉష్ణోగ్రత ప్రభావం తగ్గింది.

ఖమ్మంలో పిడుగుపాటు



ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో ఖమ్మంలోని పాత డీఈఓ కార్యాలయంలో ఓ చెట్టుపై పిడుగు పడి మంటలు వ్యాపించాయి. భారీ శబ్దం రావడంతో ఆ ప్రాంతవాసులు ఉలిక్కిపడ్డారు. దుకాణాలు మూసేసి పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న గాంధీచౌక్ సబ్‌స్టేషన్ ఏఈ మాల్విక అటు వైపు విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. అగ్నిమాపక శాఖ వారు వచ్చి మంటలు ఆర్పారు.

రామయ్యకు నిధుల కొరత

- ఉత్సవాలు, జీతభత్యాలకే సరిపోతున్న రామాలయ హుండీ ఆదాయం
- భద్రాచలం ఆలయ అభివృద్ధి, భక్తులకు వసతులు కల్పించలేని దుస్థితి
- ప్రభుత్వం ప్రత్యేక ఫండ్ కేటాయిస్తేనే సమస్యకు పరిష్కారం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి ఆదాయ వ్యయాలు సరిసమానమవుతున్నాయి. ఏటా రామాలయ హుండీలతోపాటు వివిధ రూపాల్లో వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, ఉత్సవాల నిర్వహణకయ్యే ఖర్చులకు సరిపోతున్నాయి. దీంతో భక్తులకు మౌలిక వసతుల కల్పన, ఆలయ అభివృద్ధికి నిధులు ఉండటం లేదు. ఉత్సవాలకు ప్రభుత్వం ఫెస్టివల్ స్పెషల్ ఫండ్ కేటాయించాలని కోరుతున్నా అమలుకు నోచుకోవడంలేదు. భద్రాచలం రామయ్యకు ప్రధానంగా ఆలయ హుండీల ద్వారా, వివిధ ప్రదేశాల్లో ఉన్న భూముల కౌలు, షాపింగ్ కాంప్లెక్స్, ఇతర టెండర్ల ద్వారా ఆదాయం సమకూరుతోంది.

నూతన ఆర్జిత సేవలతో ఆదాయం పెరిగినా..

కోవిడ్‌కు ముందు సుమారుగా రూ.40 కోట్ల వరకు ఉన్న ఆదాయం, కోవిడ్ ప్రభావంతో రూ. 26 కోట్లకు పడిపోయింది. ఈ సమయంలో భక్తుల రాలేకపోవడంతో హుండీ ఆదాయం భారీగా తగ్గింది. దీంతో ఉద్యోగుల జీతభత్యాలను సైతం చెల్లించలేని పరిస్థితి నెలకొనడంతో బ్యాంకుల్లో ఉన్న రామయ్య ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను ఉపసంహరించుకున్నారు. అధికారులు ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టారు. నూతనంగా పలు ఆర్జిత సేవలు ప్రవేశపెట్టారు. 2023లో ఈఓగా బాధ్యతలు చేపట్టిన రమాదేవి పలు సంస్కరణలు, పొదుపు మార్గాలు చేపట్టడంతోపాటు ఆలయంలో జరిగే అవినీతికి అడ్డుకట్ట వేయడంతో ఆదాయం భారీగా పెరిగింది. కోవిడ్ సమయంలో క్యాన్సిల్ చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను తిరిగి రామయ్య ఖాతాకు పంపించారు. 2023–24 సంవత్సరంలో సుమారుగా రూ.55.45 కోట్ల ఆదాయం వచ్చింది. ఉత్సవాలకు ఏటా నిర్వహణ వ్యయం పెరగడంతో వ్యయం సైతం సుమారు రూ. 51 కోట్లు ఖర్చు పెట్టారు. ఇలా ఆదాయ వ్యయాలు సరిసమానంగా పరిగెడుతున్నాయి.

భక్తులకు మౌలిక వసతులు శూన్యం

ఆదాయం పెంచేందుకు నూతన ఆర్జిత సేవల పెంపు ఉన్నత, మధ్య తరగతి వర్గాలకు అనుకూలంగా ఉన్నా సామాన్య భక్తులకు మాత్రం లాభం చేకూర్చ లేదు. రామయ్యకు ప్రధానంగా తెలంగాణ, ఏపీ ఇతర రాష్ట్రాల్లోని గ్రామాల నుంచి నిరుపేద భక్తులు అధికంగా వస్తుంటారు. వీరికి మౌలిక వసతుల కల్పనలో దేవస్థానం అధికారులు విఫలమవుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో డార్మెటరీ హాల్స్, వసతి గృహాలు అతి స్వల్పంగా ఉన్నాయి. శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాల సమయంలో సామాన్య భక్తులకు కరకట్టలు, గోదావరి తీర ప్రాంతాలే తాత్కాలిక ఆవాసాలుగా మారుతున్నాయి. నిత్యాన్నదానానికి సైతం పరిమిత సంఖ్యలో టోకెన్లను అందిస్తున్నారు.



రామాలయం

ఫెస్టివల్ స్పెషల్ ఫండ్ కేటాయిస్తేనే..

దేవస్థానానికి వచ్చే ఆదాయంలో ఏటా ముక్కోటికి రూ. కోటి, శ్రీరామనవమికి సుమారు రూ. 2 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇతర వేడుకలకు మరో రూ. కోటి వరకు ఖర్చవుతోంది. ఇలా దేవస్థానానికి వచ్చే ఆదాయంలో ఏడాదికి రూ.4 కోట్ల వరకు ఉత్సవాల నిర్వహణకే ఖర్చవుతోంది. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టకపోవడంతో నిధులు వృథాగా ఖర్చు అవుతున్నాయని భక్తులు అంటున్నారు. ఏటా ప్రభుత్వం తరఫున ముక్కోటికి, శ్రీరామనవమికి ఫెస్టివల్ స్పెషల్ ఫండ్ కేటాయిస్తే, హుండీ ఆదాయం ఆలయ అభివృద్ధికి, వసతుల కల్పనకు ఉపయోగించుకునే అవకాశం ఏర్పడుతుంది.

క్లుప్తంగా

కారేపల్లి సంతలో డీసీ తనిఖీ


మేకలను పట్టుకున్న డీసీ శ్రీకాంతరావు

కారేపల్లి: దేవాదాయ ధర్మాదాయ శాఖ కారేపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాస్థానం పరిధిలో నిర్వహిస్తున్న వారాంతపు సంతను దేవాదాయ శాఖ డీసీ శ్రీకాంతరావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంతలో కొనుగోలు చేసి ఏపీలోని అనకాపల్లికి ట్రాలీలో సుమారు 80 మేకలను తరలిస్తుండగా.. డీసీ శ్రీకాంతరావు వాహనాన్ని పట్టుకుని తనిఖీ చేయగా.. కేవలం 23 మేకలు కొనుగోలు చేసినట్లు రశీదులు కనిపించాయి. దీంతో మిగతా మేకలకు జరిమానా విధించారు. సంతలో పశువులు, మేకలు, గొర్రెలు రశీదులు లేకుండా విక్రయాలు చేపట్టి వాహనాల్లో తరలిస్తుంటే సిబ్బంది ఏం చేస్తున్నారని, ఈ ఒక్క వారమే ఇలా ఉందంటే.. ఏడాది పొడువునా సంత ద్వారా దేవాదాయ శాఖకు వచ్చే ఆదాయం ఎంత ఉంటుందో అర్థమవుతోందని డీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత, ఈఓ నల్లమోతు శేషయ్య ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఎస్‌ఆర్‌గార్డెన్స్ సమీపంలో ఖమ్మంఅర్బన్ పోలీసులు ఆదివారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నారు. పశువుల విలువ రూ.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. యాదాద్రి జిల్లాకు చెందిన ఇద్దరు వ్యాపారులు తాళ్లపల్లి శ్రీనివాస్, రమేశ్ ఏపీ రాష్ట్రంలోని ద్రాక్షారామం, పిఠాపురం ప్రాంతాల్లో పశువులను కొనుగోలు చేసి యాదాద్రి పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలిందని, వ్యాన్‌డ్రైవర్, వ్యాపారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

ఇద్దరిపై కేసు?

ఖమ్మంఅర్బన్: హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళను డబ్బుల విషయంలో బెదిరించిన కేసులో ఇద్దరిపై ఖమ్మంఅర్బన్ (ఖానాపురం హవేలి) పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైనట్లు తెలిసింది. మహిళకు డబ్బులు ఇచ్చిన వ్యక్తులకు మద్దతుగా మాజీ పోలీస్ అధికారి మహిళను ఖమ్మం పిలిపించి బెదిరించడంతో పాటు బంగారు ఆభరణాలు లాక్కున్నట్లు సదరు మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై సీఐ భానుప్రకాష్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా స్పందించలేదు. కేసు విషయాలను బయటకు చెప్పకుండా గోప్యంగా ఉంచడంపై చర్చనీయాంశమైంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అవయవదానంతో పలువురికి పునర్జన్మ..


ఏలేంద్ర (ఫైల్)

మణుగూరుటౌన్: తాను మరణించి తన అవయవాలను దానం చేసి మానవత్వం చాటుకున్న ఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. తీవ్రమైన రక్తపోటుతో ఆస్పత్రిలో చేరిన మణుగూరుకు చెందిన వివాహితకు మెదడులో రక్తనాళాలు చిట్లి బ్రెయిన్‌డెడ్ అయింది. బతికేందుకు ఎలాంటి అవకాశాలు లేవని వైద్యులు నిర్ధారించడంతో మహిళ భర్త, కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు. మున్సిపాలిటీ పీకే-1 సెంటర్‌కి చెందిన మర్రికుక్కల రాములు ఓసీ-2లో సింగరేణి కార్మికుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన భార్య ఏలేంద్ర (55) ఇంట్లో పనిచేసుకుంటున్న క్రమంలో నాలుగు రోజుల కిందట ఒక్కసారిగా స్పృహ తప్పి కిందపడింది. హైదరాబాద్‌లోని వైద్యులను సంప్రదించగా బతికే అవకాశాలు లేవని చెప్పారు. వెంటనే ఆమె భర్త, అల్లుడు పొన్న కనకయ్య ఆమె అవయవాలను దానం చేశారు. ఆది వారం అశ్రునయనాల మధ్య ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఏలేంద్ర మృతితో పీకే-1 సెంటర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

చెట్టు పైనుంచి పడి కార్మికుడు మృతి

పాల్వంచ: జెన్‌కో గెస్ట్ హౌస్ వద్ద మామిడి చెట్టు పైనుంచి పడి కేటీపీఎస్ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గట్టాయిగూడెంనకు చెందిన మహ్మద్‌గౌస్ (41) జెన్‌కోకాలనీలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం గెస్ట్‌హౌజ్‌లో ఉన్న మామిడి చెట్టు కింద పడి ఉండటంతో తోటి కార్మికులు గమనించి అధికారులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే తలపగిలి తీవ్ర రక్తస్రావమై మృతి చెంది ఉన్నాడు. కాగా, మామిడి చెట్టు ఎక్కి పండ్లు కోసేందుకు యత్నించి కింద పడి ఉండవచ్చని భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు, పలువురు కార్మిక సంఘాల నాయకులు సందర్శించారు. మృతుడి భార్య తస్లీం సుల్తానా ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

ఫలరాజుకు కష్టకాలం


అరకొర కాతతో ఉన్న మామిడి

మామిడి దిగుబడులను కాటేసిన తెగుళ్లు

- తామర పురుగు సోకి నిలవని పూత
- ఎకరాకు టన్నుకు మించని దిగుబడి
- డిమాండ్ ఉన్నా తప్పని నష్టాలు
- రూ.80 వేల వరకు పలుకుతున్న టన్ను ధర

ఖమ్మంవ్యవసాయం: ఫలరాజుగా పేరుగాంచిన మామిడికి కష్టకాలం వచ్చింది. అనావృష్టి, తెగుళ్లు దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. గతేడాది తెగుళ్ల కారణంగా పంట దిగుబడి పడిపోగా.. ఈ ఏడాది తెగుళ్లకు తోడు కనీస వర్షపాతం లేకపోవటం దెబ్బతీసింది. అయితే, అరకొరగా వచ్చిన దిగుబడికి డిమాండ్ బాగానే ఉన్నప్పటికీ స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించక తప్పడం లేదు. పంట నాణ్యత ఆధారంగా ప్రస్తుతం పెద్ద మార్కెట్లలో టన్నుకు రూ.80 వేలు ఆపైన ధర పలుకుతోంది. రాష్ట్రంలో మామిడి పంట సాగుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా పెట్టింది పేరు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 42 వేల ఎకరాల్లో మామిడి పంట సాగులో ఉంది. ఖమ్మం జిల్లాలో 32 వేల ఎకరాల్లో, భద్రాద్రి జిల్లాలో 10 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఉమ్మడి జిల్లాలో భిన్న రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే బంగినపల్లి, తోతాపురి, రసాలు, హిమాయత్, దసేరి, మల్లికా, మంజీర, సువర్ణరేఖ, జహంగీర్ వంటి రకాలను రైతులు పండిస్తున్నారు. సత్తుపల్లి, అశ్వారావుపేట, మధిర, వైరా, ఇల్లెందు, కొత్తగూడెం ఉద్యాన డివిజన్లలో మామిడి తోటల విస్తీర్ణం అధికంగా ఉంది.

తెగుళ్లు, ప్రతికూల పరిస్థితులు..

మామిడి తోటలకు ఈ ఏడాది ఆది నుంచి ప్రతికూల పరిస్థితులే ఉన్నాయి. వాతావరణం అనుకూలించక పూత ఆలస్యంగా వచ్చింది. డిసెంబర్‌లో రావాల్సిన పూత జనవరిలో వచ్చింది. అక్కడక్కడా ఫిబ్రవరిలో కూడా పూత వచ్చింది. మిరప తోటలను ఆశించి దెబ్బతీసిన తామర పురుగు మామిడి తోటలను కూడా ఆశించింది. రైతులు గుర్తించి నివారణ చర్యలు చేపట్టే సమయానికే పూత రాలిపోయింది. అక్కడక్కడా నిలిచిన పిందెకు కూడా నల్లి తెగులు ఆశించింది. మామిడి ఎకరా కౌలు రూ.50 వేల వరకు ఉంటుంది. ప్రతికూల పరిస్థితుల్లో ఈ ఏడాది ఎకరాకు రూ.20 వేలకు మించి కౌలు లభించటం లేదు. దీంతో రైతులు నష్టపోతున్నారు. మామిడి సాధారణంగా ఎకరాకు 4 టన్నుల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది ఎకరాకు టన్నుకు మించి దుగుబడులు రావటం లేదు. హిమాయిత్, దసేరి, కేసరి ఆ దిగుబడి కూడా రాకపోగా.. బంగినపల్లి, రసాలు, తోతాపురి వంటివి ఎకరాకు టన్ను వరకు వస్తున్నాయి.

డిమాండ్ ఉన్నా సైజు లేదు..

మామిడికి స్థానిక, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంది. అందుకు తగిన నాణ్యమైన పంట లభ్యత లేదు. అధికంగా మార్కెట్‌లోకి వచ్చే బంగినపల్లి మామిడికాయ బరువు 350 గ్రాములు ఉంటుంది. ఈ ఏడాది తగిన వర్షపాతం లేక, ఇతర కారణాలతో 300 గ్రామలకు మించి బరువు రావటం లేదు. ఇక దిగుబడులు బాగా తగ్గిపోవటంతో పంటకు డిమాండ్ పెరుగుతోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పండించే మామిడి రకాలను వ్యాపారులు దేశం నలుమూలలకు, విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. రైతులు మాత్రం హైదరాబాద్, సూర్యాపేట, వరంగల్, నాగపూర్ పండ్ల మార్కెట్లలో విక్రయిస్తున్నారు. మామిడి సీజన్‌లో స్థానికంగా కూడా మార్కెట్లు ఏర్పాటవుతాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎర్రగుంట, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఎర్రుపాలెం, ఖమ్మం తదితర ప్రాంతాల్లో మార్కెట్లను కొందరు వ్యాపారులు ఏర్పాటు చేసి రైతుల నుంచి మామిడి పండ్లను కొనుగోలు చేస్తున్నారు.

మామిడికి అంతా ప్రతికూలమే..



సకాలంలో పూత రాలేదు. వచ్చిన పూతకు తామర పురుగు ఆశించడంతో రాలిపోయింది. పురుగు మందులు మార్చి మార్చి పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎకరాకు 4 టన్నుల దిగుబడి రావాలి. కొన్ని రకాల తోటలు పూర్తిగా పోయాయి. కొన్ని రకాలు ఎకరాకు టన్ను వరకు మాత్రమే దిగబడి వచ్చాయి. ఈ ఏడాది మామిడి బాగా నష్టం మిగిల్చింది.

– గొడ్డుపల్లి లక్ష్మాజీరావు, బయ్యన్నగూడెం, పెనుబల్లి మండలం, ఖమ్మం జిల్లా

పంట లేక ఎగుమతి చేయడంలేదు..



పంట దిగుబడులు లేకపోవటంతో విదేశాలకు ఆశించిన స్థాయిలో ఎగుమతి చేయలేకపోతున్నాం. అమెరికా, కెనడాల నుంచి ఆర్డర్లు ఉన్నాయి. ఇక్కడ పంట దిగుబడి లేదు. బంగినపల్లి, హిమాయత్, మల్లిక వంటి రకాలు ఎగుమతులు చేస్తుంటాం. బంగినపల్లి అక్కడక్కడా లభ్యమవుతున్నాయి. నిర్వహణ, సస్యరక్షణ, యాజమాన్యం ఖర్చులు పెరిగాయి.

– బియ్యని రవీందర్, రైతు, ఎగుమతిదారుడు, రాఘబోయినగూడెం, ఇల్లెందు మండలం

పెరిగిన ధర..

రెండేళ్లుగా ఫలరాజుకు ధర పలుకుతోంది. సాధారణంగా మామిడి రకాన్ని బట్టి టన్ను ధర రూ.15 నుంచి రూ.30 వేల వరకు ఉంటుంది. ఈ ఏడాది పంట లేకపోవటంతో నాణ్యమైన పంటకు ఢిల్లీ, నాగపూర్, చిలిగిరి వంటి మార్కెట్లలో రూ.80 వేల వరకు ధర ఉంటోంది. ఇక వరంగల్, సూర్యాపేట, హైదరాబాద్ వంటి మార్కెట్లలో మాత్రం నాణ్యత ఆధారంగా ప్రస్తుతం రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతోంది. ఈ ఏడాది సామాన్యులు, మధ్య తరగతి వర్గాలకు మామిడి పండ్లు దూరమయ్యే పరిస్థితి నెలకొంది.


ఎగుమతికి మామిడి కాయను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

మార్కెట్‌లో కిలో రూ.120 వరకు విక్రయిస్తున్నారు. ఈ ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.

‘కోడ్’ కలవరం..

- ఇటు ముహూర్తాలు.. అటు ఆంక్షలు..
- నగదు తరలించలేక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- శుభకార్యాల సామగ్రి సమకూర్చుకోలేని దుస్థితి..


సత్తుపల్లి వద్ద వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు

సత్తుపల్లిటౌన్: ఈ నెలాఖరు తర్వాత మూఢాలతో దాదాపు మూడు నెలల వరకు మళ్లీ శుభకార్యాలు లేనట్టే.. ప్రస్తుతం ముహూర్తాలు ఉండటంతో జిల్లాలో చాలాచోట్ల పెళ్లిళ్ల సందడి నెలకొంది. ఒక్క పెళ్లిళ్లే కాకుండా గృహ ప్రవేశాలు.. ఆలయ ప్రతిష్ఠాపనలతోపాటు ఇతర శుభకార్యాలతో సందడి వాతావరణం నెలకొంది. అయితే వీటిలో ఏ తంతు మొదలు పెట్టాలన్నా కూడా లక్షల రూపాయలు చేతులు మారాల్సిందే. కాగా, పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో నగదు లావాదేవీలకు కష్టాలు వచ్చిపడ్డాయి. రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు తరలిస్తే చెక్‌పోస్టుల వద్ద పోలీసులు పట్టుకుంటున్నారు. సరైన ఆధారాలు చూపకపోతే నగదును సీజ్ చేస్తున్నారు. దీంతో నగదు తరలించాలంటే ఇబ్బంది ఎదురవుతోంది. శుభకార్యాలు పెట్టుకున్నవారి పరిస్థితి దయనీయంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు జిల్లాలు సరిహద్దున ఉండటంతో శుభకార్యాలు నిర్వహించేవారు నగదుతో ఎటూ కాలు కదపలేని పరిస్థితి నెలకొంటోంది. ఎన్నికల నియమావళి వల్ల నగదుతో సరిహద్దులు దాటే పరిస్థితి లేకపోవటంతో ఇంట్లో శుభకార్యం జరుగుతున్న ఆనందం.. ఎన్నికల ఆంక్షలతో ఆవిరి అవుతోందని ప్రజలు వాపోతున్నారు. ఏప్రిల్ చివరిలో వివాహాలు అధికగంగా ఉండడంతో సామగ్రి సమకూర్చుకునేందుకు నిర్వాహకులు అష్టకష్టాలు పడుతున్నారు.

ఎక్కడికక్కడే చెక్‌పోస్టులు..

అంతర్ జిల్లా చెక్‌పోస్టులతో పాటు అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముహూర్తాల వేళ ఈ తనిఖీ లు కలవర పెడుతున్నాయి. కట్నకానుకలు, పెళ్లి దుస్తులు, ఫంక్షన్‌హాళ్ల బుకింగ్, బంగారం కొనుగోళ్లు.. పెళ్లింట చేపట్టే పనులకు అడ్వాన్స్‌ల చెల్లింపులకు అవస్థలు లేదు. ఎన్నికల కోడ్ ఎఫెక్ట్‌తో ఆన్‌లైన్ చెల్లింపులు కూడా పెద్ద మొత్తంలో చేయాలంటే జంకాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. సారె వస్తువులు, గృహోపకరణాల కొనుగోలుకు నగదు తీసుకురావటానికి భయపడుతున్నారు.

రూ.50 వేలు మించితే సీజ్..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేల కంటే ఎక్కువ నగదు వెంట తీసుకెళ్లితే పోలీసులు తనిఖీ చేసి సీజ్ చేస్తున్నారు. దీంతో వధూవరుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకొస్తే వాటికి ఆధారాలు చూపించాల్సి వస్తోంది. అదీగాక శుభకార్యాల కోసం సామగ్రిని సరిపడా కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. గతంలో కంటే ఎన్నికల కోడ్ వల్ల ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్‌లో వ్యాపారం ఆశించిన స్థాయిలో లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు.

తగిన ఆధారాలు ఉండాల్సిందే..



నగదు పెద్ద మొత్తంలో తీసుకెళ్లేటప్పుడు తగిన ఆధారాలు చూపిస్తేనే అనుమతి ఉంటుంది. రూ.50 వేలకు మించి నగదుతో ప్రయాణం చేస్తే సీజ్ చేస్తారు. జిల్లాస్థాయి కమిటీ విచారించి నిర్ధారించిన తర్వాతనే నగదు విడుదల చేస్తారు. ఎన్నికల నిబంధనలను అందరూ పాటించి సహకరించాల్సిందే.

– ఎ.రఘు, ఏసీపీ, సత్తుపల్లి

తలంబ్రాల బుకింగ్‌కు స్పందన కరువు


రామయ్య ముత్యాల తలంబ్రాలు (ఫైల్)

- ఖమ్మం రీజియన్‌లో 2,200 మాత్రమే నమోదు
- ఈ నెల 25 వరకు అవకాశం

చుంచుపల్లి: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి వెళ్లలేని భక్తుల కోసం ఆర్టీసీ లాజిస్టిక్ సేవల ద్వారా నేరుగా ఇంటి వద్దకే ముత్యాల తలంబ్రాలను అందించేలా ఏర్పాట్లు చేసింది. కార్గో లాజిస్టిక్ సేవల ద్వారా రూ.151 చెల్లించి తమ వివరాలు నమోదు చేసుకున్న భక్తులకు ముత్యాల తలంబ్రాలను నేరుగా అందిస్తారు. దీనికోసం ఈనెల 4 నుంచి 18 వరకు ఖమ్మం రీజియన్ పరిధిలోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోల పరిధిలో లాజిస్టిక్ కేంద్రాల ద్వారా బుకింగ్‌కు అవకాశం కల్పించారు. భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరిగే నవమి వేడుకల్లో ఉపయోగించే ముత్యాల తలంబ్రాలకు ఎంతో విశిష్టత ఉంది. ఈ తలంబ్రాలను శుభకార్యాల్లో అక్షింతలుగా వాడితే రాముల వారి అనుగ్రహం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఈ క్రమంలోనే తలంబ్రాలు సేకరణకు ఆసక్తిని కనబరుస్తారు. అయితే ఈసారి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలకు భక్తుల నుంచి ఆదరణ అంతంత మాత్రంగానే ఉంది. కార్గో పాయింట్ల ద్వారా భక్తులు ముత్యాల తలంబ్రాలను బుకింగ్ చేసుకోవడానికి అంతగా ఆసక్తి చూపడం లేదని తెలిసింది. గతేడాది 5,653 బుకింగ్‌లు నమోదు కాగా, వాటిని భక్తులకు సకాలంలో అందించలేదనే అపవాదు ఆర్టీసీపై ఉంది. అంతేకాక సంస్థ అధికారులు దీనిపై ప్రచారం కూడా అంతగా కల్పించలేకపోయారనేది వాస్తవం. ఈ కారణాల వల్లనే ఈసారి తలంబ్రాల బుకింగ్‌కు భక్తులు ముందుకు రాలేదని తెలుస్తోంది. కాగా, ముత్యాల తలంబ్రాల బుకింగ్ గడువు ఈ నెల 18తో ముగియగా, తిరిగి 25 వరకు పొడిగించారు. శనివారం నాటికి ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల్లో 2,200 బుకింగ్‌లు నమోదయ్యాయి. ఖమ్మం డిపో పరిధిలో 465, మధిరలో 77, సత్తుపల్లిలో 1000, భద్రాచలంలో 129, కొత్తగూడెంలో 455, మణుగూరులో 74 చొప్పున బుకింగ్‌లు నమోదయ్యాయి.

నరకయాతన..

చెరువులో దిగబడి అవస్థలు పడిన గేదెలు


చెరువులో దిగబడిన గేదెలు

నేలకొండపల్లి: మేత కోసం వెళ్లిన గేదెలు.. అనుకోకుండా ప్రమాదవశాత్తు చెరువులో దిగబడ్డాయి. బయటకు రాలేక నానా అవస్థలు పడుతున్నాయి. మండలంలోని చెరువుమాధారం చెరువు చివర పొలాల వైపు ఆదివారం మేతకు ఉదయం 10 గంటల సమయంలో పలు గేదెలు వెళ్లాయి. అనుకోకుండా రెండు గేదెలు పూడికలో ఇరుక్కున్నాయి. బయటకు వచ్చేందుకు వీలులేక తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. ఉదయం నుంచి రైతులు వచ్చి చూస్తున్నారు తప్ప.. వాటిని బయటకు లాగేందుకు ప్రయత్నించటం లేదు. చివరకు చెరువుమాధారం గ్రామానికి చెందిన రాములు అనే రైతుకు చెందిన గేదెలుగా గుర్తించారు. పలువురు రైతులు ట్రాక్టర్ సాయంతో బయటకు లాగారు. వీటితో పాటు వచ్చిన లేగ దూడ వాటి కోసం ఒడ్డున ఉండి తారాడుతూ.. అరుస్తున్న దృశ్యం పలువురిని కంటతడి పెట్టించింది.

జగన్ గెలుపు కోసం దివ్యాంగుడి ప్రచారం


విజయనగరంలో ప్రచారం చేస్తున్న పీవీ చలమయ్య

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు పీవీ చలమయ్య(కమలాకర్) ఏపీలో జగన్ గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు. చలమయ్య వైఎస్సార్‌కు వీరాభిమాని. వైఎస్ జగన్ ప్రభుత్వం మళ్లీ రావాలని తనవంతుగా ఏపీలో వారం రోజుల నుంచి విస్తృతంగా, వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని అసెంబ్లీ అభ్యర్థి వీరభద్రస్వామి, పార్లమెంట్ అభ్యర్థి చంద్రశేఖర్ విజయాన్ని కాంక్షిస్తూ వారం రోజులుగా ప్రచారం చేపట్టారు. సోమవారం భీమిలికి వస్తున్న ఏపీ సీయం జగన్‌ను కలిసి దివ్యాంగుల సమస్యల గురించి వివరిస్తానని పేర్కొన్నారు. విజయనగరం జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ జమ్ము శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రచారాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.

సబ్‌స్టేషన్‌లో పేలిన ట్రాన్స్‌ఫార్మర్


గాయపడిన లైనెమెన్ లింగాచారి

తల్లాడ: స్థానిక సబ్‌స్టేషన్‌లో ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో విధి నిర్వహణలో ఉన్న లైన్‌మెన్‌పై మండుతున్న ఆయిల్ పడి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. లైన్‌మెన్ పి.లింగాచారి గంటకోసారి రీడింగ్ తీసే బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. రీడింగ్ తీస్తుండగా ఎండ వేడికి ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. లోపల ఉన్న వేడి ఆయిల్ లైన్‌మెన్ లింగాచారిపై పడటంతో శరీరం, చేతులకు గాయాలయ్యాయి. ఆయన్ను 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి చికిత్స నిమత్తం తరలించినట్లు ఏఈ రాజేశ్ తెలిపారు.

తిలక్‌నగర్‌లో వ్యక్తి ఆత్మహత్య

ఇల్లెందురూరల్: మండలంలోని తిలక్‌నగర్ గ్రామ పంచాయతీ కుమ్మరిబస్తీకి చెందిన ఊరకొండ జనార్దన్ (51) ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. తిలక్‌నగర్‌లో తనకు ఉన్న భూమిని ఓ రైతుకు కౌలుకు ఇచ్చాడు. కౌలుకు తీసుకున్న రైతు భూమిలో జామాయిల్ సాగు చేశాడు. అదే భూమిని జనార్దన్ వేరొకరికి విక్రయించడంతో కొనుగోలు చేసిన వ్యక్తి జామాయిల్‌ను పూర్తిగా నరికేశాడు. తాను సాగు చేసిన జామాయిల్‌ను నరికి తనను నష్టపర్చారని ఆరోపిస్తూ కౌలుకు తీసుకున్న రైతు కోర్టును ఆశ్రయించాడు. ప్రస్తుతం బోనకల్‌లో నివాసం ఉంటున్న జనార్దన్ కోర్టు వాయిదాకు హాజరయ్యేందుకు శనివారం రాత్రి ఇల్లెందుకు చేరుకొని ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. భూవివాదం వల్లే జనార్దన్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. భార్య రాజమని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ దుకాణంపై దాడి

అశ్వారావుపేటరూరల్: బెల్ట్ దుకాణంలో నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మండలంలోని పాతనారంవారిగూడెం గ్రామంలోని ముమ్మారెడ్డి సత్యనారాయణ నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణంలో తనిఖీలు చేయగా రూ.26,334 విలువైన మద్యాన్ని గుర్తించినట్లు స్థానిక ఏఎస్ఐ యాకూబ్‌అలీ తెలిపారు. పట్టుకున్న మద్యం సీసాలను సీజ్ చేసి, బెల్ షాపు నిర్వహిస్తున్న సత్యనారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మహేంద్రవర్మ మృతదేహం

దమ్మపేట: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని నెమలిపేట గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అల్లిపల్లి గ్రామానికి చెందిన కలిదిండి మహేంద్రవర్మ(35) కొన్నేళ్ల కిందట తన భార్యతో కలిసి ఏపీలోని భీమవరం పట్టణంలో నివసిస్తున్నాడు. కొంతకాలంగా మహేంద్రవర్మకు తన భార్యకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మహేంద్రవర్మ ఐదు నెలల కిందట తిరిగి స్వగ్రామమైన అల్లిపల్లికి వచ్చి గేదెల డెయిరీ ఫామ్‌లో పనిచేస్తూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పొలం బేరానికి తెలిసిన వ్యక్తులు వస్తున్నారని చెప్పి బైక్‌పై బయటకు వెళ్లాడు. సాయంత్రం సమయంలో మహేంద్రవర్మ తమ్ముడు విజయ రామారావు ఇంటికి ఫోన్ చేసి నెమలిపేట శివారులో గల పామాయిల్ తోటలో అన్న పురుగులమందు తాగి చనిపోయాడని తల్లిదండ్రులకు తెలిపాడు. పొలం బేరానికి అని చెప్పి వెళ్లిన తమ కుమారుడు మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లి కలిదిండి ప్రమీల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతిడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

గుండెపోటుతో లారీడ్రైవర్ మృతి


ఖలీల్ మృతదేహం

కల్లూరు: కల్లూరులోని ఓ హోటల్ వద్ద ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో లారీడ్రైవర్ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఖలీల్ (55) అనకాపల్లి నుంచి సిద్దిపేటకు వెళ్తూ మార్గమధ్యలో కల్లూరు ఎన్ఎస్‌పీలోని ఓ హోటల్ వద్ద భోజనం చేసేందుకు దిగుతుండగా గుండెనొప్పి రావడంతో స్థానికులు హోటల్‌లో కూర్చోబెట్టి 108 వాహనానికి ఫోన్ చేశారు. దాదాపు 45 నిమిషాల వరకు అంబులెన్స్ రాకపోవడంతో స్థానికులు ధరావత్ రవికుమార్, తిలక్ సెల్‌పాయింట్ యజమాని భూక్యా రాజ్‌కుమార్ ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఖలీల్ మృతి చెందాడు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యుడు, సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరని, ఉన్న నర్సు నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు ఆరోపించారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

నేలకొండపల్లి: ఎలుకల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మంగాపురంతండాకు చెందిన బి.గోపి(20) నాలుగు రోజుల కిందట ఎలుకల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమించటంతో ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎలుకల మందు తాగటానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఈతకు వెళ్లి బాలుడు...

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంనకు చెందిన బాణోత్ కిరణ్‌కుమార్ (11) పాలేరు చెరువులో ఈతకు వెళ్లి నీటమునిగి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఐదో తరగతి చదువుతున్న కిరణ్‌కుమార్ ఈ నెల 20న మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికి వచ్చి ఆడుకొని వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. అనంతరం స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి సాయంత్రం గ్రామ శివారులోని గంగమ్మ ఆలయం వద్ద చెరువులో నీట మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి రవీందర్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.